
# తోడు

ముసునూరి పేరయ్యశాస్త్రి



రఘుపతి వరండాలో అడుగుపెట్టి, అక్కడి దృశ్యం చూసేసరికి ముఖం ఎర్రబడింది

రాజూ! గట్టిగా అరిచాడు

ఆ అరుపుకు భవనమంతా దద్దరిల్లి పోయింది కుర్చీలో కూర్చున్న రాజు రక్కున లేచి నిలబడ్డాడు అనుకోని ఈ భయంకరమైన అరుపుకు అక్కడే కూర్చున్న కొడుకులు, కూతురు అదిరి పడ్డారు

రాజు చేతులు కట్టుకొని నిలబడ్డాడు అతను ఆ యింట్లో డ్రైవరుగా పనిచేస్తున్నాడు

రఘుపతి ముందుకు వచ్చి రాజు కెదురుగా నిలబడ్డాడు అతని ముఖం వైపు సూటిగా చూస్తున్నాడు ఆ చూపులను తట్టుకోలేని రాజు తలదించేశాడు

ఏరా, ఈ యింటి అల్లుడివా నువ్వు? అడిగాడు రఘుపతి

రాజు కంగారు పడిపోతూ అయ్యగారూ! తప్పైపోయింది ఇంకెప్పుడూ అలా కుర్చీలో కూర్చోను అన్నాడు

అసలు నా పిల్లల ముందు, నా యింట్లో కుర్చీలో కూర్చోడానికి నీ కెన్ని గుండెల్రా! అడిగాడు

డాడీ కూతురు పిలిచింది

రఘుపతి వెను దిరిగాడు

ఏమిటి? అడిగాడు

మేమే అతనిని కూర్చోమన్నాము అంది

దాంతో మరింత ఆవేశం ముంచుకు వచ్చింది రఘుపతికి

మీరు కూర్చోమన్నారా? అసలు మీకు బుద్ధి వుందా! మీరెవర్రు? కోటీశ్వరుని పిల్లలు మీకో ప్రత్యేకత వుంది మీరు దర్జాగా బ్రతకాలి మన స్థాయి కంటే ఎక్కువ వున్న వారితోనే మనం మాట్లాడాలి వీడెవడు ఆఫ్టరాల్ డ్రైవరు వాడు వాడు వాడు మీ మధ్య కుర్చీలో కూర్చుంటాడా! అంటే, వాడు మన స్థితికి వస్తున్నాడా, మనం వాడి స్థితికి దిగజారుతున్నామా! ఏమైనాగానీ, ఒక వేళ మీరు కూర్చోమని చెబితే కూర్చోడమేనా! అని రాజువైపు తిరిగి, రాజూ ఇంకోసారి ఇటువంటి దృశ్యం కళ్ళబడితే ఏం చేస్తానో నాకే తెలియదు అనేసి వెళ్ళిపోయాడు

రాజు తలపైకెత్తాడు

అతని కళ్ళల్లో కన్నీళ్ళు

అవి చూసిన అక్కడున్న వారి హృదయాలు మూగబోయాయి

రాజూ, నాన్నది ఎదగని మనసు పాత కాలపు మనిషి మా వల్ల నువ్వు మాట పడవలసి వచ్చింది అంది రఘుపతి కూతురు పద్మ

రాజు కళ్ళు తుడుచుకుని లేదండమ్మగారు, అయ్యగారు చెప్పింది నిజమే నాదే తప్పు వస్తానమ్మగారు అనేసి వెళ్ళిపోయాడు

పద్మ స్థాణువులా అలాగే నిలబడిపోయింది

మంచి మనసు గల మనిషికి విలువ పడిపోతూ పైపై అడంబరాలు ప్రదర్శిస్తూ పెద్ద మనిషిగా చలామణీ అయ్యే మనిషికే విలువ పెరిగి పోతున్న ఈ రోజుల్లో రాబోయే రోజుల్లో ఈ దేశమేమై పోతుందో?

పద్మకి జవాబురాని ప్రశ్నలు ఉదయిస్తుండగా అన్నగార్లు పిలవడంతో వెళ్ళిపోయింది

*   *   *   *

రోజులు వేగంగా గడచి పోతున్నాయి

రఘుపతి ఆస్తి పెంచుకుంటున్నాడు కొడుకులకి, కూతుళ్ళకి పెళ్ళిళ్ళు చేసేశాడు సంఘంలో తనకంటూ ఒక ప్రత్యేకతను సంతరించుకొని, పెద్దమనిషిగా చలామణీ అవుతున్నాడు

రఘుపతి జీవితం వడ్డించిన విస్తరే! అయితే, ఆ విస్తరిలో ఏ క్షణాన ఏ దుష్టశక్తులు గరళాన్ని గుమ్మరిస్తాయో చెప్పడం కష్టం అది తెలియదు కాబట్టే జీవితానికో బలీయమైన నిర్వచనముంది జీవితానికే విలువ వుంది దానికో అందముంది

ఒక రోజు–

రఘుపతి క్లబ్ నుంచి వచ్చి వంట్లో స్థిమితం లేక మంచం మీద నడుం వాల్చాడు కాసేపు ఏదో తెలియని బాధ పడ్డాడు చివరికి కాళ్ళు చచ్చుబడిపోయాయి వెంటనే ఆసుపత్రికి తరలించారు ఉన్నవాడు తలచు కొంటే దేవుడే దిగివస్తాడు కాబట్టి, ఖరీదైన డాక్టర్లు ఖరీదైన మందులు ఎన్నో యెన్నెన్నో ఎందరొచ్చినా, ఏమి చేసినా రోగాన్ని తప్పించుకోలేని రఘుపతి అవిటి వాడే

అయ్యాడు డాక్టర్లు ఆసుపత్రిలో నే వుండమన్నారు

చుట్టాలు వస్తున్నారు

స్నేహితులు వస్తున్నారు

ఎందరో వస్తున్నారు పలకరించి సానుభూతి కురిపించి మరింత దిగులు పెంచుతున్నారు

కొడుకులు ఎప్పుడో వస్తున్నారు చూసి అక్కడ వుండలేక వెళ్ళిపోతున్నారు

కూతుళ్ళు వచ్చి కన్నీరు పెట్టుకుని తమ ఆస్తుల పంపకము విషయమై లౌక్యంగా చెబుతున్నారు.

భార్య వస్తుంది ఏవో చెబుతుంది

"అబ్బా, వాసన" అని ముక్కు మూసుకుంటుంది

"ఎవర్రా అక్కడ" అని పిలుస్తుంది

ఎవడో వస్తాడు

'అబ్బ, ఈయన మల మూత్రాలు వెంట వెంటనే శుభ్రం చేయండయ్యా! ఛస్తున్నాము అంటుంది.

ఇంతలో రాజు వచ్చాడు

"అమ్మగారూ! మన అయ్యగార్ని మనమే చూసుకోవాలి మీరలా అయ్యగారి యెదుట అంటే ఆయన మనసు బాధ పడుతుంది " నెమ్మదిగా అన్నాడు

రాజు వచ్చి రఘుపతి మూత్రం విసర్జించిన బెడ్‌షీటు, పంచె మార్చివేసాడు

అదీ రోజూ జరిగే తతంగం

జీవితంలో కష్టమనే పదమెరుగని రఘుపతికి ఒంటరిగా ఎన్నోసార్లు ఏడుస్తున్నాడు

ఎందుకంటే–

తనవారి నుంచి ఎంతో సానుభూతి ఆశించాడు కానీ, కన్న తండ్రిపై సానుభూతి కురిపించే తీరిక కొడుకులకిలేదు ఇక్కడే వుండి భర్త మంచి చెడ్డలు చూసే ఓపిక భార్యకిలేదు

రాజే వస్తాడు రాజే అన్నీ చేస్తాడు బయటి విషయాలు చెబుతాడు పేపరు చదివి వినిపిస్తాడు

రఘుపతిని ఆసుపత్రి నుంచి డిశ్చార్జి చేశారు ఇంటికి వచ్చాడు గడపదాటి అడుగువేస్తూ గొల్లుమన్నాడు ఎన్నో భయంకరమైన ఆలోచనలు అతన్ని భయపెడుతున్నాయి రాజు ముందుకు వంగి "అయ్యగారూ! మీరే బెంగ పడిపోతే అమ్మగారి సంగతెలాగో ఆలోచించారా అన్నాడు

అంత బాధలోనూ రఘుపతికి నవ్వు వచ్చింది

అయితే, ఆ నవ్వు వెనుక వున్న అంతరార్థాన్ని అతని కెదురుగా వున్న కుటుంబ సభ్యు లెవరికి అర్థం గాలేదు ఒక్క రాజుకే అర్థమైంది అతని హృదయము ద్రవించి పోయింది ఇక నుంచి అయ్యగారు పరాధీనమైన మనిషి పాపం ఏ పని చేయాలన్న మరో మనిషి అవసరం తప్పనిసరి! అనుకొన్నాడు

రెండ్రోజులు గడిచాయి

రఘుపతి కాస్త తేరుకొన్నాడు

బయటికి వెళ్ళాలని, నలుగురిలో తిరగాలని ఎన్నో కోరికలు తన పరిస్థితి గుర్తుకు వచ్చి నిరాశ కలుగుతోంది

ఇంతలో అటు వైపుగా వచ్చిన భార్యను చూసి, ఇదిగో, ఒంటరిగా బోరుగావుంది ఆ వీల్ చైర్లో కాసేపు తోటలో తిప్పుతావా! అడిగాడు

ఆమె బీరువా తెరిచి వేటికోసమో వెతుకుతూ, కాసేపాగండి అవతల మీనాక్షి వచ్చింది దానికి ఈ మధ్య కొన్న నెక్లెస్ చూపించలేదు అనేసి, తన క్కావలసినది తీసుకొని గదిదాటి వెళ్ళి పోయింది ఇంతలో వీల్ చైర్ తీసుకొస్తున్న రాజును చూసింది అతను రావడం రఘుపతి చూసాడు

'వస్తున్నావా రాజూ కాస్త అయ్యగారికి తోడుగా వుండు అస్తమానూ తిప్పమంటారు కాస్త ఓపిక వచ్చే వరకూ కనిపెట్టుకొని వుండండి అని హుకుంజారి చేసి హడావుడిగా వెళ్ళిపోయింది

రాజు వచ్చాడు

అయ్యగారూ!" అని పిలిచాడు

రఘుపతి పలకలేదు అయితే, రాజునే కన్నార్పకుండా చూస్తున్నాడు చేతులు రెండూ జోడించి చూస్తున్నాడు

రాజు ఆశ్చర్యపోతునాడు

"అయ్యగారూ!' నెమ్మదిగా బాధగా పిలిచాడు

రఘుపతికి దుఃఖం పెల్లుబికి వచ్చింది గొల్లుమన్నాడు

ఒరే, రాజూ! నువ్వు దేవుడివిరా! గతంలో నిన్ను ఎన్నోసార్లు, యెన్నో విధాలుగా అవమానించాను మా హోదాకు భంగం కలిగిస్తున్నావని తిట్టాను నీతో చనువుగా మాట్లాడ వద్దని పిల్లలకి చెప్పాను కానీ రాజూ, నువ్వే నాకు తోడుగా వుంటావని- నువ్వే నా పాలిట దేవుడివి అవుతావని అనుకోలేదురా! రాజూ నన్ను క్షమించవు నాకు తోడుగా వుండవు ఒరే, నువ్వు లేకపోతే ఈ మనుష్యుల మధ్య బ్రతకలేనురా!" అంటూ గొల్లుమన్నాడు మళ్ళీ

రాజు నిర్ఘాంతపోయాడు

"అయ్యగారూ! మీకేమీ ఫర్వాలేదు " అంటూ రఘుపతి కన్నీటిని తుడిచాడు రఘుపతి అతని వంకే చూడసాగాడు □

## అంతే తేడా!

వయసులో వున్న ఆడది
వయ్యారాలు పోతే
వృద్ధులు సైతం
వువ్విళ్ళూరుతారు!
వయసుడిగిన ఆడది
విన్యాసాలు చేస్తే
యువకులు సైతం
సన్యాసుల్లో కలుస్తారు!

–కె. శివకుమార్

## తోడు

